క్లుప్తంగా

నేడు మదర్ థెరిస్సా జయంతి

మఠంపల్లి : మండల కేంద్రంలో శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మదర్ థెరిస్సా 114వ జయంతిని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్యపరీక్షలు



ఉచితంగా ఎండోస్కోపి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు శ్వేత, సునీల్‌కుమార్

హుజూర్‌నగర్ : పట్టణంలోని లింగగిరిరోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశ్వేత ఆస్పత్రిలో ఆదివారం వైద్యులు ఉచితంగా ఎండోస్కోపి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్‌కుమార్ చౌదరి, డాక్టర్ శ్వేత అట్లూరి గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్న దాదాపు 25మందికి ఎండోస్కోపి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అట్లూరి మంజుల, అట్లూరి హరిబాబు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి

నడిగూడెం : తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలని, విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా

హుజూర్‌నగర్ : పట్టణంలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 7, 20, 27వ వార్డులలో డెంగీ పాజిటివ్ కేసులు నమోదవుతున్నందున ఆయా వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లింపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల అధికారులు, మెప్మా ఆర్పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఎన్నిక

సూర్యాపేట : పట్టణంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముప్పారపు నరేందర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మారం పవిత్ర, చల్లా లక్ష్మీకాంత్, బొలిశెట్టి మధు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తోట కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా దేవరశెట్టి నాగరాజు, కోశాధికారిగా ఉప్పల శ్రవణ్ కుమార్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా గండూరి కృపాకర్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మీలా మహదేవ్, సోమ హేమమాలిని, ముప్పారపు నాగేశ్వరరావు, గెల్లి అంజన్ ప్రసాద్, గుండా కిరణ్ కుమార్, మాడిశెట్టి శ్రీనివాస్, నల్లపాటి శ్రీధర్, జెల్లా ప్రసాద్, మిర్యాల వెంకటేశ్వర్లు, పీవీ లక్ష్మీ నారాయణను ఎన్నుకున్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

చివ్వెంల : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ, సూర్యాపేట మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి అక్టోబర్ 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సూర్యాపేట నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాలు అధిక సంఖ్యలో నమోదుచేయాలని సూచించారు. 100 సభ్యత్వాలు చేసిన వారికి క్రియాశీలక సభ్యత్వం వస్తుందని తెలిపారు. వారికి మండల, జిల్లా స్థాయిలో పదవులు వస్తాయన్నారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్‌లుగా రంగినేని లక్ష్మణ్‌రావు, గోగుల రమేష్, సలిగంటి శ్రీనివాస్, నూకల శైలేందర్‌లను నియమించారు. అదే విధంగా సూర్యాపేట మండల ఇన్‌చార్జ్‌లుగా ఉప్పు శ్రీనివాస్, జ్యోతుల యుగేందర్, పలస వెంకన్న, రవిలను నియమించారు.

'ఎల్-34' నిర్వహణ అస్తవ్యస్తం

- ఎత్తిపోతల పథకం మోటార్లు, పైపులైన్లకు చేపట్టని మరమ్మతులు
- మేజర్, మైనర్ కాల్వల్లో పేరుకుపోయిన పూడిక, కంపచెట్లు
- సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా బీళ్లుగానే భూములు
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు



నడిగూడెం సమీపంలో ఉన్న ఎల్-34 ఎత్తిపోతల పథకం



నడిగూడెం వద్ద బీడుగానే ఉన్న భూమి

నడిగూడెం : మండల కేంద్రం సమీపంలో ఉన్న సాగర్ ఎడమకాల్వకు అనుబంధంగా ఉన్న ఎల్-34 ఎత్తిపోతల పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొద్ది సీజన్‌లుగా ఈ పథకానికి సంబంధించిన మోటార్లు, విద్యుత్ సరఫరా, పైపులైన్ దెబ్బతినడం, మేజరు, మైనర్ కాల్వలు అధ్వానంగా మారడంతో ఆ ఆయకట్టు రైతులకు ఇబ్బందిగా మారుతుంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా, సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి రెండు వారాలైనా నేటికీ సమీపంలోని ఈ ఎల్-34 ఎత్తిపోతల పథకానికి చుక్కనీరు కూడా విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ పథకం కింద ఉన్న ఆయకట్టు రైతుల ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసి సాగర్ ప్రాజెక్ట్‌లో అధికంగా నీరు ఉన్నా ఇక్కడి రైతులు మాత్రం సాగుకు నోచుకోక తమ భూములను బీళ్లుగానే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పథకం మరమ్మతుల నిర్వహణకు నీటిపారుదల శాఖ రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది. కానీ సంబంధిత అధికారులు మరమ్మతులు మరిచిపోయి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకం కింద నడిగూడెం, రామాపురం గ్రామాలలో దాదాపు 600ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన కాల్వలకు అప్పటి నుంచి మరమ్మతులు చేయకపోవడంతో మట్టితో పూడిపోయి, కంపచెట్లతో అల్లుకుపోయి చివరి భూములకు నీరందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

అధ్వానంగా కాల్వలు..

ఎల్-34 ఎత్తిపోతల పథకం పరిధిలోని మేజరు, మైనర్ కాల్వలు అధ్వానంగా మారాయి. పలు చోట్ల కాల్వ కోతకు గురికావడంతో పాటు కంపచెట్లు దట్టంగా అల్లుకుపోయి అస్తవ్యస్తంగా మారాయి. ఇంకా పలు చోట్ల కాల్వలు మట్టితో పూడిపోయాయి. తూముల వద్ద షట్టర్‌లు కూడా సక్రమంగా లేని పరిస్థితి. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మేజర్, మైనర్ కాల్వలకు నీరు సరిగ్గా రాకపోవడంతో పలువురు రైతులు బోర్ల ఏర్పాటుతో పాటు, బావులు తీయించుకొని సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగర్ ప్రాజెక్ట్‌లో నీరుపుష్కలంగా ఉండడంతో ఈ ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి, రైతులకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

తక్షణమే నీటిని విడుదల చేయాలి



వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తుంది. నేటికీ ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయలేదు. దీంతో సాగు భూములు బీళ్లుగానే ఉంచుకోవాల్సిన పరిస్థితి. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి, మోటార్లు, పైపులైన్లు, విద్యుత్ సమస్యను పరిష్కరించి సాగు నీటిని తక్షణమే విడుదల చేయాలి.

– శ్రీరాముల శేషు, రైతు, నడిగూడెం

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు బోనాలు



గరిడేపల్లి : కీతవారిగూడెంలో బోనాలతో తరలివస్తున్న మహిళలు, గ్రామపెద్దలు



మఠంపల్లి : చౌటపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు, మహిళలు



పాలకవీడు : ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం, చౌటపల్లి గ్రామాలలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో, గ్రామస్తులు యాటపోతులను మేళతాళాలతో ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయాల వద్ద బోనాలను, యాటపోతులను నైవేద్యంగా సమర్పించారు. రఘునాథపాలెంలో ఆర్యవైశ్యులు మహిళలు పిల్లాపాపలతో కలిసి వన భోజనాలకు వెళ్లారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో ముత్యాలమ్మ పండుగను గ్రామపెద్ద కాపు ఎల్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రస్తుతం గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలను జ్వరాల బారి నుంచి రక్షించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో ముత్యాలమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాల నడుమ గ్రామస్తులు దేవతలకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో అధిక సంఖ్యలో తరలివచ్చి ముత్యాలమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, గ్రామపెద్దలు చింతకాయల సైదులు, షేక్ చాంద్‌పాషా, కీత రామారావు, రాములయ్య, సతీష్, సోమయ్య, కోటేశ్వరరావు మహిళలు పాల్గొన్నారు.

బీసీవిద్యార్థి గర్జనను విజయవంతం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న కృష్ణయ్య తదితరులు

మునగాల : ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్య, నిరుద్యోగ, వసతిగృహాల సమస్యలు, బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే తదితర డిమాండ్లతో సెప్టెంబర్ 5న కోదాడ పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించే బీసీ విద్యార్థి గర్జన సభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన నల్లగొండలో జరిగిన ఓ కార్యక్రమంలో బీసీ విద్యార్థి గర్జన సభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆర్ కృష్ణయ్యతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. ఈ సభకు బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెపల్లి అంజి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్, బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు బస్సు రాజ్యం, యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు అయితగాని జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

నడిగూడెంలో వనభోజనాలు



నడిగూడెంలో వనభోజనాలకు తరలివెళ్తున్న కాలనీవాసులు

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన వడ్డెర కాలనీవాసులు ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన అన్ని కుటుంబాలు గట్టుమైసమ్మ ఆలయం వద్దకు వెళ్లి అక్కడే భోజనాలు తయారు చేసుకొని ఆరగించారు. రోజంతా ఆట, పాటలతో గడిపారు. కార్యక్రమంలో కాలనీపెద్దలు దేవరంగుల వీరన్న, పల్లపు రామయ్య, పల్లపు శ్రీను, పెద నాగేశ్వరరావు, తిరుమలేష్, చిననాగేశ్వరరావు, వల్లెపు సత్యం, గుంజ పెదవెంకన్న, వల్లెపు శ్రీనివాస్, గుంజ వీరబాబు, యల్లయ్య, మురళి పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలో చిన్నారులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో ముందుస్తుగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ.. అందరి జీవితాలలో ఆనందం ప్రజ్వరిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులు చేసిన యశోద కృష్ణ గోపికల వేషధారణ, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు రాజియోగిని, బీకే శైలజ, గుడిపాటి రాధిక, నాగమణి, మాధవి, ప్రతాపరెడ్డి, మల్లయాద్రి, రామనరేష్ తదితరులు పాల్గొన్నారు.

మగ్దూం మొహియొద్దీన్‌కు ఘన నివాళి

హుజూర్‌నగర్ : పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మగ్దూం మొహియొద్దీన్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మొక్క నాటుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, ప్రకృతి సమతుల్యతకు వనసంరక్షణ చేపట్టాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని నూతన రామాలయం ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాధ్యతగా తెలుసుకొని అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, రామాలయ కమిటీ సభ్యులు కృపాకర్, నర్సింహస్వామి, లయన్స్‌క్లబ్ సభ్యులు సైదిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, క్రాంతికుమార్, విశ్వనాథ్, కనకయ్య, శ్రీను, రంగారెడ్డి, ధనుంజయనాయుడు, ఆదినారాయణ, నాగార్జున, కాలనీవాసులు తదితరులున్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవాలు

ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ నూతన విగ్రహ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవాలను మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామాల్లోని మహిళలంతా బోనాలు సమర్పించారు. గ్రామంలోని ఆలయాలన్నింటిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆలయంలో గణపతి హోమంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేణారెడ్డిలు ఆలయంలో పూజలు చేశారు. దండుమైసమ్మ ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆత్మకూరు ఎస్ఐ సైదులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలు చేస్తున్న దామోదర్‌రెడ్డి, తదితరులు

కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలు



అతిథులను శాలువా, పూలమాలలతో సత్కరిస్తున్న సమితి సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్ర సంగీత సాహిత్య కళానిధి, గానకళా ప్రపూర్ణ, ఉత్తమ వాగ్గేయకార పురస్కార గ్రహీత విజయవాడకు చెందిన నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణమాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుమారులు ఎన్‌సీ బుచ్చయ్యచార్యులు, చక్రవర్తి మాట్లాడారు. సాహిత్యం, సంగీతం, హరికథ రంగంలో కృష్ణమాచార్యులు చేసిన కృషి, జీవితంలోని ముఖ్యఘట్టాలను వివరించారు. తదుపరి కృష్ణమాచార్యుల కుమారులు, శిష్య ప్రశిష్యులు సంగీత కచేరి, సంగీత, సాహిత్యోత్సవము నిర్వహించారు. అనంతరం సేవాసమితి సభ్యులు అతిథులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు ముడుంబ జగన్నాథచార్యులు, రంగాచార్యులు, గుండా రమేష్, కాంతయ్య, నందయ్య, బొంత రాంరెడ్డి, సుందర్‌రావు, గెల్లి విద్యాసాగర్ పాల్గొన్నారు.

భజన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం, శ్రీ అన్నమయ్య భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 11టీములు పాల్గొన్నాయి. రసవత్తరంగా జరిగిన ఈ పోటీలలో ప్రథమ బహుమతిని సీతారామాంజనేయ భజన మండలి అల్లీపురం వారు కైవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతిని జైగురు భజన మండలి గానుగబండ, తృతీయ బహుమతి రేవూరి నీలంపాటి లక్ష్మీఅమ్మ భజన మండలి, చతుర్థ బహుమతి శ్రీశ్రీనివాస భజన మండలి శ్రీనివాసపురం, పంచమ బహుమతి వెంకటేశ్వర భజన మండలి గుడి మల్కాపురం వారు గెలుచుకున్నారు. కాగా పోటీలలో పాల్గొన్న గీతా గోవిందం భజన మండలి హుజూర్‌నగర్ వారు, సీతారామాంజనేయ భజన మండలి రామాపురం వారు, శ్రీ సీతారామాంజనేయ భక్త భజన మండలి బేతవోలు వారు, శ్రీ ఆంజనేయ భజన మండలి బూరుగడ్డ వారు, కోదండ రామస్వామి భజన మండలి ఆచార్యులగూడెం వారు, బాల ఉగ్ర నరసింహ భజన మండలి ఎరవ్రరం వారికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో భజన పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు, ప్రతి టీంకు షీల్డ్, ప్రతి సభ్యుడికి ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా ఎం.బ్రహ్మం గురూజీ, బి.చంద్రం వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాచిమంచి కొండయ్య, చప్పిడి భిక్షం, ఆకుల రాము, దొంతగాని సత్యనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో 2000–2001విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆనాటి స్మృతులను గుర్తుచేసుకుని ఒకరికొకరూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన గురువులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కొప్పుల భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ కొప్పుల రంగారెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సైదిరెడ్డి, రమేష్, యూసుఫ్‌బాబా, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.

'డబుల్' ఇళ్లకు తప్పని విద్యుత్ సమస్య





విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అక్రమంగా స్తంభం నుంచి ఏర్పాటు చేసుకున్న వైర్లు

చిలుకూరు : గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నేటి వరకు మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ ఇళ్ల పంపిణీ చేసిన ప్రభుత్వం వారికి కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించింది. మండలంలోని బేతవోలు గ్రామంలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాని వారికి విద్యుత్ సౌకర్యం కల్పించకుండా అధికారులు వదిలేశారు. దీంతో గత్యంతరం లేక వారే సొంతంగా విద్యుత్ స్తంభాల నుంచి తీగలు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. వాస్తవానికి అక్రమ కరెంట్, ప్రమాదం అని తెలిసినా వారు విద్యుత్ కోసం తీగలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ ఉండడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో తెలి యని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

నిండుకుండలా మునగాల ఊరచెరువు



సాగర్‌నీటితో నిండుకుండలా మారిన ఊరచెరువు

మునగాల : మండల కేంద్రం పరిధిలో గల ఊరచెరువుకు సాగర్‌నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. మూడు నెలల క్రితం చెరువులో నీరు లేక పూర్తిగా ఎండిపోవడంతో మునగాలలో తాగునీటికి కటకట ఏర్పడింది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సాగర్ ఎడమకాలువకు సాగు, తాగునీటిని విడుదల చేయడంతో మునగాల శివారులో ఉన్న ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన ఎల్-33ఎత్తిపోతల పథకం ద్వారా పదిరోజులుగా ఊరచెరువుకు సాగర్ నీరు వస్తుండడంతో నిండుకుండలా మారింది. మరో వారం రోజుల్లో ఊరచెరువు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది. చెరువులో పుష్కలంగా నీరు ఉండడంతో చెరువు కింద ఉన్న బోర్లు, బావులలో భూగర్భజలాలు పెరిగే అవకాశముంది. దీంతో చెరువు కింద సుమారు 300ఎకరాలలో రెండు పంటలకు అవకాశం ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయానికి దర్వాజా అందజేత



దర్వాజా అందజేస్తున్న దాతలు రవిశేఖర్, దీపారాణి

సూర్యాపేట రూరల్ : శ్రీ భేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ దీవెనలు పట్టణ ప్రజలందరిపై ఉండాలని ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ రవిశేఖర్, దీపారాణి అనంతుల అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల నగర్ భేచిరాగ్ మాదారం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి రూ. లక్ష 50వేల విలువ చేసే టేకు దర్వాజా, తలుపులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్దాసు ఏడుకొండలు, ఆర్గనైజర్ వల్దాస్ రాజీవ్, హనుమంతరావు, జలంధర్‌రెడ్డి ఉన్నారు.